క్లుప్తంగా

రైతు సంఘం అధ్యక్షుడిగా తాయన్న



కోసిగి: మండల రైతు సంఘం అధ్యక్షుడిగా పరసాని తాయన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ సమక్షంలో రైతు సంఘం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం తాయన్నను రైతు సంఘం అధ్యక్షుడిగా ఎంపిక చేశారు.

పంట నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి సునీత

గోనెగండ్ల : సాగుచేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి సునీత, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. బుధవారం మండలంలోని హెచ్. కై రవాడి గ్రామంలో ఏఓ హేమలత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ తిమ్మారెడ్డి, విస్తరణ అధికారులు పులిరాజు, నిఖిల, గోపాల్ పాల్గొన్నారు.

ఆదోని రూరల్: మండలంలో ఖరీఫ్ సీజన్ 2025–26కు సంబంధించి పంటలను సాగుచేసిన రైతులు తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని ఏఓ సుధాకర్ సూచించారు. బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ పంటల నమోదు చేయించుకోవడం వల్ల రైతులు సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందని, పంటలు నష్టపోతే నష్టపరిహారం అందుతుందన్నారు.

ఉపాధ్యాయులతో తల్లిదండ్రుల వాగ్వాదం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఓ ఉన్నత పాఠశాలలో విద్యార్థి తల్లిదండ్రులు బుధవారం ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు. సదరు పాఠశాల 7వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తోటి విద్యార్థులతో అల్లరి చేస్తూంటే ప్రధానోపాధ్యాయుడు మందలించడంతో పాటు కొట్టాడు. విషయం తెలుసుకొన్న విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థి సంఘం నాయకులను తీసుకొచ్చి ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు.మా పిల్లవాన్ని ఎందుకు కొట్టారు, మీరు ఎవరు కొట్టడానికి అంటూ విద్యార్థి సంఘం నాయకులతో పాటు తల్లిదండ్రులు ఒకరి మీద ఒకరు ప్రశ్నల వర్షం కురిపించారు. చివరికి ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు, విద్యార్థి సంఘం నాయకులకు సర్ది చెప్పడంతో వాగ్వవాదం సద్దు మణిగింది.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నల్లన్న మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తరఫున ఎంపీపీ గొల్ల కేశన్న, కోటేకల్ లక్ష్మన్న, పెద్దయ్య, రాఘవేంద్ర, వెంకటేష్ మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుటుంబం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన

ఆదోని అర్బన్: జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో స్థానిక శివశంకర్‌నగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఉత్తమ పోషకాహార విలువలు కలిగిన క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, ఆకుకూరలు, చిక్కీ, వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా, కార్యదర్శి రఘు, సభ్యులు వెంకటేశ్వర్లు, మహిళా విభాగ అధ్యక్షురాలు మమత, కార్యదర్శి శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

కేసు నమోదు

మంత్రాలయం రూరల్ : ఒంగోలు నుంచి మంత్రాలయం మండలంలోని కాచాపురం గ్రామానికి అక్రమంగా తరలించి నిల్వ ఉంచిన ఎరువులు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం ఏఓ గణేష్ మాధవరం ఎస్ఐ విజయకుమార్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఏఓ మాట్లాడుతూ.. కాచాపురం గ్రామానికి చెందిన శ్రీరామ ట్రేడర్స్ యజమాని మురారి ఆనంద శెట్టి అక్రమంగా ఎరువులను నిల్వ ఉంచారు. యూరియా 300 బస్తాలు, 20 : 20: 0: 13– 400 బస్తాలు అక్రమంగా నిల్వ చేయడంపై విజిలెన్స్ దాడులు చేపట్టారని వివరించారు. అందులో భాగంగా వారిపై కేసు నమోదుకు ఫిర్యాదు చేసినట్లు ఏఓ వివరించారు. దీనిపై ఫర్టిలైజర్ కన్‌ట్రోల్ ఆర్డర్–1985, ఫర్టిలైజర్ మూమెంట్ కన్‌ట్రోల్ ఆర్డర్ –1973 చట్టాల రీత్యా కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

6న ‘చలో విజయవాడ’

ఆదోని సెంట్రల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 6వ తేదీన చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి విద్యార్థులందరూ కదలి రావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని భగత్ సింగ్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శశిధర్, సంజయ్, శివ, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ భయోెం!

☛ ఇటీవల ఎమ్మిగనూరులోని అంబేడ్కర్ సర్కిల్‌లోని పంచముఖి ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణంలో నకిలీ, బయోమందులు విక్రయిస్తున్నారని ఓ రైతు ఏకంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆగస్టు 19న ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, తహసీల్దార్ శివశంకర్, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ శివశంకర్ తదితరులు దాడుల చేసి రికార్డులు పరిశీలించి అనుమతి లేని బయో మందులను గుర్తించారు. ఇందులో భాగంగా రూ.63,150 విలువైన అనధికార మందులను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసి రూ.13.12లక్షల విలువైన పురుగు మందుల విక్రయాలను నిలిపివేశారు. అదే విధంగా ఐదు రోజుల క్రితం ఎమ్మిగనూరు హనుమాన్ ట్రేడర్స్‌లో తనిఖీలు చేసి రూ.4,06,158ల విలువైన పురుగు మందుల అమ్మకాలను వ్యవసాయ శాఖ అధికారులు నిలిపివేశారు.

- రైతులను కలవర పెడుతున్న నకిలీ బయో మందులు
- జోరుగా విక్రయాలు
- రైతుల బలహీనతలను సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు



పెస్టిసైడ్ షాపులో తనిఖీ చేస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

ఎమ్మిగనూరుటౌన్: కొండనాలుకకు మందేస్తే వున్న నాలుక ఊడిందన్న చందంగా మారింది ప్రస్తుత వ్యవసాయ రంగం. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని పెస్టిసైడ్ వ్యాపారులు జోరుగా నకిలీ బయో మందులను అంటగడుతూ లాభాలు గడిస్తున్నారు. వ్యవసాయ శాఖ గుర్తింపు, అనుమతుల్లేని బయోఉత్పత్తులను పట్టణంలో విక్రయిస్తున్నారని రైతులే అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అధికారులు అడపాదడపా దాడులు చేస్తున్నా.. వ్యాపారులు వారి కళ్లుగప్పి వ్యాపారం కొనసాగిస్తున్నారు.

మార్కెట్‌లో బయో మందులే ఎక్కువ

పట్టణంలో 80కిపైగా పెస్టిసైడ్ దుకాణాలుండగా కొన్ని దుకాణాల్లో వ్యాపారులు సాధారణ పురుగుల మందుల కంటే నకిలీ ఆర్గానిక్, బయో ఉత్పత్తులను జీ1, జీ2 అనుమతి లేకుండా విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం వ్యవసాయ శాఖ సూచించే సాధారణ మందులు విక్రయిస్తే తక్కువ లాభాలు రావడమే. అదే బయో ఉత్పత్తులు విక్రయిస్తే సాధారణ క్రిమిసంహారక మందుల కంటే ఎక్కువ లాభాలొస్తాయి. బయో, ఆర్గానిక్ అసలు పోలిన నకిలీ పేర్లతో రూ.250లు ఖరీదు చేసే వాటిని రూ.900ల నుంచి రూ.1000ల వరకు రైతులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అలా విక్రయించిన మందులకు సంబంధించి రైతులకు బిల్లుల రసీదులు సైతం ఇవ్వడంలేదు.

నిండా మునుగుతున్న అన్నదాత

వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన మందులతో పంటలను ఆశించిన చీడపీడలు అంచెలంచులుగా తగ్గే అవకాశం ఉంది. అయితే చీడపీడలు త్వరగా నివారించాలనే ఆతృతతో వ్యాపారుల రైతులు వ్యాపారుల మాటలు నమ్మి బయోఉత్పత్తులను మోతాదుకు మించి ఒకట్రెండు సార్లు పిచికారీ చేస్తున్నారు. కొన్ని నకిలీ బయో మందులు, ఆర్గానిక్ ఉత్పత్తుల వాడకం వల్ల దోమ, పురుగు నివారించబడినట్లు కనిపించినా మళ్లీ రెండు మూడు రోజుల్లోనే చీడపీడలు ఆశిస్తున్నాయని బాధిత రైతులు వాపోతున్నారు. బయోమందుల్లో ఎక్కువగా సింథటిక్, ఫెర్రిత్రాయిడ్స్ ఉండటం వల్ల దోమలు పూర్తిస్థాయిలో మృతిచెందకపోగా భవిష్యత్‌లో ఎలాంటి పురుగు మందులు వాడినా నివారించలేనంతగా ఉధృతమవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని నకిలీ బయోమందులను పూర్తిస్థాయిలో అరికట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

మాయమాటలు చెప్పి మోసం..

ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో 50వేల హెక్టార్లకు పైగా ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగవుతోంది. కొందరు వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని.. పిసరంతైనా రసాయనిక పదార్థాలు వాడలేదంటూ నమ్మించి ఆయా నకిలీపురుగు మందులు, బయోఉత్పత్తులను అంటగట్టి లాభాలు గడిస్తున్నారు. బయోమందులు సాధారణ మందులకంటే శక్తివంతంగా పనిచేస్తాయని, అదేవిధంగా నిషేధిత గడ్డి మందులను వాడితే కలుపు వుండదని పంట అధిక దిగుబడులు ఇస్తాయంటూ రైతులను నమ్మించి వాటిని కూడా అంటగట్టి సొమ్ముచేసుకుంటున్నారు. వాటిపై సరైన అవగాహన లేని రైతులు వ్యాపారుల మాయమాటలకు నమ్మి మోసపోతున్నారు. చీడపీడలను నివారించి పంటలను కాపాడుకోవాలనుకునే ఆతృతతో అన్నదాతలు డబ్బు ఖర్చుకు వెనుకాడకుండా వ్యాపారులు చెప్పిన పురుగుమందులను పిచికారీ చేసి.. అవి పూర్తిస్థాయిలో పనిచేయకపోతుండటంతో నష్టపోతున్నారు.

గుర్తింపులేని బయో మందులు విక్రయిస్తే చర్యలు



గుర్తింపులేని బయోమందులను విక్రయిస్తే చర్యలు తప్పవు. పెస్టిసైడ్ మందులు, ఎరువులు వ్యవసాయ శాఖ అనుమతి తీసుకొనే విక్రయించాలి. రైతులు కూడా కొనుగోలు చేసిన ప్రతి మందుకు రసీదు తీసుకోవాలి. వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన బయో మందులు ఉపయోగిస్తే పంటలకు బాగుంటుంది కానీ గుర్తింపు లేని వాటిని వినియోగిస్తే రైతులకు నష్టమే. నకిలీ బయోమందులు చీడపీడలను నివారించడం అటుంచి ఏకంగా పంటలు, భూముల సారాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకొని ఆయా మందులను కొనుగోలు చేయాలి.

– మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

కఠిన చర్యలు తీసుకోవాలి



నకిలీ బయోమందులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆయా మందులు విక్రయించే దుకాణాలను సీజ్ చేసి చేతులు దులుపుకోకుండా వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వ్యాపారులు కూడా నిజాయితీగా మందుల వ్యాపారాలు చేస్తారు. నకిలీ మందులతో రైతులు రూ.లక్షల్లో అప్పుల పాలవుతున్నారు.

– గద్దం లక్ష్మీనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి

టౌన్ సీఐని సస్పెండ్ చేయాలి

ఎమ్మిగనూరురూరల్: వినాయక నిమజ్జనానికి వెళ్తున్న యువకులపై విచక్షణ రహితంగా దాడి చేసిన టౌన్ సీఐ శ్రీనివాసులపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందు పరిషత్, హిందు సంఘాల నాయకులు ఉపేంద్రారెడ్డి, శ్రీనివాసులు కోరారు. బుధవారం స్థానిక సోమప్ప సర్కిల్ నుంచి శివ సర్కిల్ మీదుగా డీఎస్పీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత నెల 31న సోగ నూరు రోడ్డు నుంచి వినాయక నిమజ్జనకు వెళ్తున్న యువకులపై టౌన్ సీఐ విచక్షణ రహితంగా బూటు కాలుతో తంతూ దాడి చేశారని చెప్పారు. అలాగే వినాయక నిమజ్జన రోజు రాత్రి సోమప్ప సర్కిల్లో కొందరు యువకులపై కూడా సీఐ లాఠీతో చితక బాదడం బాధాకరమన్నారు. బూటు కాలుతో ఆటో డ్రైవర్‌ను తన్నటంతో తీవ్ర గాయాలు అయ్యాయని, అంతటితో అగకుండా నోటికి వచ్చిన మాట్లాడటం దారుణమన్నారు. అనంతరం డీఎస్పీ ఎంఎన్ భార్గవికి వినతి పత్రం అందజేశారు.

బయో మెడికల్ వ్యర్థాలను డస్ట్ బిన్లలో వేయొద్దు

ఆదోని టౌన్: పట్టణంలోని ల్యాబ్‌టెక్నీషియన్లు, ఆర్‌ఎంపీలు బయో మెడికల్ వ్యర్థాలైన డ్రెస్సింగ్, గ్లౌజ్, దూది, డ్రెస్సింగ్ పాడ్స్, శానిటరీ పాడ్స్, ఇంజెక్షన్లు తదితర వాటిని డస్ట్‌బిన్లలో వేయరాదని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శానిటేషన్ పారిశుద్ధ్య కార్మికులు తడి చెత్త, పొడి చెత్త వ్యర్థాలను వేరు చేసే సమయంలో ప్రమాదకరమైన బయోమెడికల్ వ్యర్థాలు సాధారణ చెత్తలో కలిపి పారవేస్తున్నట్లు గుర్తించారన్నారు. వాటి వల్ల మానవాళికి ప్రమాదకరమన్నారు. ఇది పురపాలక సిబ్బంది, ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయన్నారు. బయోమెడికల్ వ్యర్థాలను అనుమతించబడిన ఏజెన్సీకి మాత్రమే అందజేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉరుకుందలో టెండర్లు



టెండర్ల పత్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ కార్యాలయంలో వివిధ పనులకు ఆన్‌లైన్ మరియు సీల్డ్ టెండర్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. దేవాలయానికి అగరబత్తుల సరఫరా, కిరాణం సరుకులకు టెండర్లు నిర్వహించారు. డీసీ వాణి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో టెండర్లకు దరఖాస్తులు రాలేదని తెలిపారు. ఆరు కిరాణం సరుకులకు గాను విశ్వగంగా అసోసియేట్స్ ఆదోని వారు రెండింటికి బెల్లం కేజీ రూ.23, కందిబ్యాళ్లు కేజీ రూ.52.20 చొప్పున హెచ్చు పాటదారునిగా నిలిచినట్లు తెలిపారు. గంగులి రామిరెడ్డి, ఉరుకుంద వారు మిగిలిన నాలుగు కిరాణా సామగ్రికి, కలగలపు బియ్యం కేజీ రూ.20, బియ్యం కేజీ రూ.28, శనగ బ్యాళ్లు కేజీ రూ.41, రవ్వ కేజీ రూ.25కు హెచ్చు పాటదారునిగా నిలిచినట్లు వెల్లడించారు. అగరబత్తిలకు ఎవరూ టెండరు వేయలేదని తెలిపారు. ఆదోని గ్రేడ్–1 ఎగ్జిక్యూటివ్ అధికారి రాంప్రసాద్ పర్యవేక్షణలో టెండర్ల వేలం పాట పత్రాలను పరిశీలించారు.

నేటి నుంచి మిలాద్-ఉన్-నబి వేడుకలు



మహమ్మద్ ప్రవక్త కేశాలతో ప్రార్థన చేస్తున్న దృశ్యం

కౌతాళం: మహమ్మద్‌ప్రవక్త చూపిన మార్గమే సరైనదని జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తి అన్నారు. ఖాదర్ లింగ స్వామి దర్గాలో మిలాద్-ఉన్-నబీ వేడుకలను గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రవక్త గారి కేశాలతో పాటు అలిమౌల కేశాలు, కాబా గృహ వస్త్రాన్ని ప్రత్యేక వాహనంలో హైదరాబాదు నుంచి తెచ్చినట్లు తెలిపారు. గురువారం గ్యార తారీఖ్ వేడుకలు ఉండడంతో రాత్రి 12గంటల తర్వాత హల్కా, జికర్, ప్రార్థనల తర్వాత రాత్రి 1గంట ప్రాంతంలో భక్తుల కోసం ప్రత్యేకంగా దర్గాలోని ఖాద్రియ మజ్జీద్ కింద భాగంలో వీటిని ప్రదర్శనకు ఉంచుతున్నట్లు తెలిపారు. శుక్రవారం మిలాద్ పండుగను పురస్కరించుకుని ఎప్పటిలాగే కేశల ప్రదర్శన దర్గా సన్నిధిలో ప్రదర్శించడం జరుగుతుందని ఉంటుందన్నారు.

శ్రీబండేగురుడి మఠం పీఠాధిపతి శివైక్యం



పీఠాధిపతి జయశంరస్వామి (ఫైల్)

నందవరం : మండల పరిధిలోని పూలచింత గ్రామానికి చెందిన శ్రీ బండేగురుడి మఠం పీఠాధిపతి జయశంరస్వామి బుధవారం శివైక్యం పొందారు. ఆయన కొద్ది రోగులుగా అనారోగ్యంతో బాధపడేవారు. గ్రామంలోని శ్రీ బండేగురుల మఠం పీఠాధిపతిగా కొనసాగుతున్న ఆయనకు ఆంధ్రతో పాటు కర్ణాటకలో అధిక సంఖ్యలో భక్తులకు శిష్యులుగా ఆశీర్వచనం చేశారు. అనారోగ్యంతో పీఠాధిపతి పరమపదించడంతో మఠంలో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పీఠాధిపతి శివైక్య క్రతువు గురువారం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఉప పీఠాధిపతి బండేప్ప స్వామి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలు

మంత్రాలయం రూరల్: కర్ణాటకలోని రాయచూర్ జిల్లా ఓబులాపురం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మంత్రాలయంలో బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొని గాయపడ్డారు. ప్రహ్లాద, నరసింహులకు తీవ్ర గాయాలుకాగా మంత్రాలయంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో ఎమ్మిగనూరుకు తరలించారు.

సురవరం సంస్మరణ సభను విజయవంతం చేద్దాం

పెద్దకడబూరు : ఈనెల 5న కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జరిగే సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను విజయవంతం చేద్దామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

క్షయవ్యాధిని పారదోలుదాం

ఆదోని టౌన్: క్షయవ్యాధిని దేశం నుంచి పారదోలుదామని, క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని కల్లుబావిలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు బాబురాజు, మేరీ, అరుణ, సుబ్బమ్మబాయి, మెహబూబ్‌బీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం



కాల్వపై వేసిన బండలను చూపుతున్న కాలనీవాసులు

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు గ్రామంలోని బీసీ కాలనీలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డిల సహకారంతో డ్రైనేజీ సమస్య పరిష్కారమైంది. గ్రామంలో బీసీ కాలనీలో కాల్వ నీరు రోడ్డుపై నిలుస్తుండటంతో గ్రామస్తులు అందులో నడుస్తూ అవస్థలు పడేవారు . ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి ఇరువైపుల మురుగు కాల్వలను ఏర్పాటు చేయించి, కాల్వపై నడిచి వెళ్లేందుకు బండలు వేయించారు. దీంతో కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మోసాలతోనే చంద్రబాబు పాలన



జోహరాపురంలో బాబు మోసాలను ప్రజలు వివరిస్తున్న నాయకులు

నందవరం : అధికారంలోకి వచ్చింది మొదలు చంద్రబాబు మోసాలతోనే పాలన సాగిస్తున్నారని రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి ఆరోపించారు. బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్ నేతృత్వంలో గంగవరం, జోహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి గ్రామాల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి రికాల్ టీడీపీ మ్యానిఫెస్టో అనే నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆయా గ్రామాల నాయకులతో విస్తృత స్థాయి సమావేం నిర్వహించారు. అనంతరం క్యూఆర్ కోడ్ లిగిన కరపత్రాలను ఇంటింటికి పంచుతూ చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, మాజీ సర్పంచ్ రామకోటేశ్వరరెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి సావిత్రమ్మ, సర్పంచులు బైటిగేరి శివన్న, వీరస్వామి, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శంకరెడ్డి, ప్రకాష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి



పెద్దకొత్తిలిలో పత్తి పంటను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుల

నందవరం : అధిక వర్షాలతో నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, నియోజకవర్గ రైతు విభాగపు అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని పెద్ద కొత్తిలి గ్రామ సమీపంలో వర్షాల తాకిడికి దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ..అధిక వర్షాలతో పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిందని, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం పత్తి రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని, ఉల్లి రూ.3 వేలు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, మాజీ సర్పంచ్ రామకోటేశ్వర రెడ్డి, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, రంగారెడ్డి, సూర్య ప్రకాష్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో సీపీఎం శిక్షణ తరగతులు

ఆదోని రూరల్: ఈనెల 6, 7వ తేదీల్లో ఆదోనిలోని మెట్రో ఫంక్షన్ హాలులో సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు, అంజిబాబు తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఆదోని రెవెన్యూ డివిజన్‌లో సాగునీరు, తాగునీరు, వలసలు, ఉపాధి తదితర అంశాలపై రాబోయే రోజుల్లో పాదయాత్రలకు సీపీఎం రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలను పోరాటాలకు సన్నద్ధం చేయడానికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదోని పాత రెవెన్యూ డివిజన్ పరిధిలో పట్టణ, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో లక్ష్మన్న, లింగన్న, గోపాల్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సారూ.. వ్యక్తిగత రేషన్ కార్డులివ్వండి



పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌కుపంపుతున్న వినతిపత్రంతో ట్రాన్స్‌జెండర్లు

ఎమ్మిగనూరుటౌన్: సారూ.. మేము మానవ జాతికి చెందిన వారమే మేము, తినడానికి రేషన్ కావాలి... తమకు రేషన్ కార్డులివ్వాలంటూ పట్టణానికి చెందిన పలువురు ట్రాన్స్‌జెండర్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. ఈ మేరకు వారు బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వినతి పత్రం పంపారు. ట్రాన్స్‌జెండర్లు వి.సింధు, గౌరికళ, సౌమ్యకుమారి, లక్ష్మి, చిట్టి, సుమన, రాధ, రమ, శ్రీవల్లి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లుగా వున్న తమకు వ్యక్తిగత రేషన్‌కార్డులు మంజూరు కాలేదన్నారు. గతంలో తమ కుటుంబాలతో కలిసి వున్నప్పుడు ఆయా రేషన్ కార్డుల్లో తాము వున్నామని, కొన్నేళ్ల క్రితం ట్రాన్స్‌జెండర్లుగా మారి సొంతవారికి, కుటుంబాలకు దూరమై బరుకుతున్నామని చెప్పారు. అయినా కుటుంబ రేషన్ కార్డుల్లో వున్న తమ పేర్లు తొలగించలేదన్నారు. ప్రస్తుతం తాము ప్రత్యేక జీవనం కొనసాగిస్తున్నందున కుటుంబ రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించి ట్రాన్స్‌జెండర్లందరికీ వ్యక్తిగత రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే సహించం

ఎమ్మిగనూరురూరల్: హిందువుల మనోభావలను దెబ్బతీయాలని చూస్తే సహించేంది లేదని జిల్లా బీజేపీ అధ్యక్షులు రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి నిమజ్జనం రోజున టౌన్ సీఐ శ్రీనివాసులు అత్యుత్సాహం ప్రదర్శించి యువకులపై దాడి చేయటం, బూటుకాలుతో తంతూ అసభ్య పదజాలంతో దూషించటం దారుణమన్నారు. పట్టణంలో శాంతిభద్రతలు కాపాడే పోలీసులే అశాంతిని సృష్టిస్తే ప్రజలు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ చర్యలను నిరసిస్తూ గురువారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టే ర్యాలీకి పెద్ద సంఖ్యలో హిందువులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

వికసించిన బ్రహ్మకమలాలు



పెద్దకడబూరులోని ముద్దురంగగురువుల మఠం ఆవరణంలో వికసించిన బ్రహ్మకమలాలు

పెద్దకడబూరు : హిమలయ పర్వత ప్రాంతాలలో ఉండే అరుదైన పుష్పం బ్రహ్మకమలం. ఇది రాత్రి వేళల్లో మాత్రమే వికసించి, తెల్లని కాంతిలా మెరిసి పోతూ అందరిని ఆకట్టుకునే స్వభావం కలిగి ఉంటుంది. సాధారణంగా సంవత్సరంలో ఒకటి లేదా రెండు సార్లు వికసించే ఈ పుష్పం రాత్రి సమయంలో మాత్రమే వికసించి ఉదయం కల్లా వాడిపోతుంది. అందుకే దీనిని ఒక రాత్రి పుష్పం అని కూడా అంటారు. పెద్దకడబూరు మండల కేంద్రంలోని శ్రీశ్రీ ముద్దురంగ గురువుల మఠం ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి రెండు పుష్పాలు వికసించి అందరిని ఆకట్టుకున్నాయి.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వేదమణి

ఎమ్మిగనూరురూరల్: పంటల సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని కర్నూలు జిల్లా జల వనరుల కేంద్రం ఏడీఏ వేదమణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని టీఎస్ కూళ్లూరు, కె.తిమ్మాపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి మదిరెపల్లి శివశంకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో నానో యూరియా, పొటాషియం నైట్రేట్స్ స్ప్రే చేసుకుంటే పత్తి పంటలో కాయ పూత, మొగ్గ రాలిపోకుండా కాపాడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు నరసింహులు, వినోద్, రసూల్, వీపీఏలు జ్యోతిర్మయి, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఆదోని అర్బన్: పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన మలేకర్ అశోక్ (30) రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. గత నెల 28న మాధవరం రోడ్డులోని రాయనగర్ సమీపంలో బైకుపై ఆదోని వైపు వస్తున్న అశోక్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో గాయాలపాలైన అశోక్‌ను స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్సల నుంచి కోలుకోలేక మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బుధవారం హైదరాబాద్ నుంచి ట్రాఫిక్ పోలీసులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో చెత్త సేకరణ, డంప్‌యార్డ్‌కు తరలించడంలో నిర్లక్ష్యం వహించవద్దని పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్త తరలింపు పనులతో పాటు పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.